సమస్యలకు పరిష్కారం.. దక్కేనా!

- మొక్కుబడిగా రెవెన్యూ సదస్సులు
- ఇప్పటికీ పూర్తయిన పది గ్రామాలు.. 440 అర్జీలు
- గ్రామ సభలలో స్వీకరిస్తున్న అర్జీలకు పరిష్కారం నిల్


మునిపల్లెలో తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న రైతు

పొన్నూరు: మండలంలో రెవెన్యూ సదస్సులు మొక్కుబడిగా సాగుతున్నాయి. గ్రామ సభలలో స్వీకరిస్తున్న అర్జీలకు పరిష్కారం ప్రశ్నార్థకంగా మారింది. కొన్ని అర్జీలు సభలలోనే పరిష్కరించి ధ్రువపత్రాలను అర్జీదారులకు అందించాల్సి ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. వివిధ కారణాలతో తిరస్కరిస్తుండటంతో అర్జీలు కూడా నామమాత్రంగా వస్తున్నట్లు సమాచారం. 8 గంటల పాటు జరిగే సదస్సులో అర్జీలు రెండు పదులు కూడా దాటని గ్రామాలుండటమే నిదర్శనం. ఈనెల 6వ తేదీన పొన్నూరు మండలంలో అధికారులు అట్టహాసంగా ప్రారంభించారు. తొలిరోజు మామిళ్లపల్లిలో రెవెన్యూ గ్రామసభను నిర్వహించగా.. 17 ఫిర్యాదులు వచ్చాయి. ఇలా ఇప్పటి వరకు రెవెన్యూ గ్రామాల్లో అధికారులు ఈ సదస్సులను నిర్వహించి 440 అర్జీలను స్వీకరించారు. సంబంధిత మ్యుటేషన్, సర్వే, కొలతల్లో వ్యత్యాసం, అడంగల్‌లో కరక్షన్, నూతన పాస్ బుక్, పేరు మార్పిడి, కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు, డిజిటల్ సంతకం, ఆక్రమణలు వంటి అనేక సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పనితీరు, అవినీతిపై కూడా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సదస్సుల్లో స్వీకరిస్తున్న అర్జీలకు గడువు విధిస్తుండటంతో మళ్లీ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే పని తప్పేలా లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమాచారం ఎక్కడ?

రెవెన్యూ సదస్సుల్లో వచ్చే ఫిర్యాదులు, వాటి పరిష్కార విషయాలను ప్రజలకు తెలియజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏ గ్రామంలో సదస్సు జరిగితే ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి. ఎన్ని పరిష్కరించారో చెప్పాల్సి ఉంది. వచ్చిన ఫిర్యాదుల సమాచారం మాత్రమే పత్రికలకు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. పరిష్కరించిన వివరాలు తెలపడంలో ఆసక్తి చూపకపోవడం గమనార్హం.

తహసీల్దార్ కార్యాలయానికి రాక తప్పదా..

తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగే పనిలేకుండా ఈ సదస్సుల ద్వారా తాము ఎదుర్కొంటున్న భూముల సమస్యలు, కష్టాలు తీరుతాయని రైతులు, ప్రజలు ఆశించారు. ఆ సదస్సుల్లో ఫిర్యాదులు చేశారు. అయితే ఆ సమస్యలను పరిష్కరించడానికి అధికారులు పెద్దగా శ్రద్ధ చూపడం లేదు. దీంతో గ్రీవెన్స్ లాగే ఈ రెవెన్యూ సదస్సు కార్యక్రమం కూడా అబాసుపాలు కాక తప్పదని రైతులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అర్జీల పరిష్కారానికి గడువు విధిస్తుండటంతో మళ్లీ తహసీల్దార్ కార్యాలయం వద్ద రోజుల తరబడి పడిగాపులు, వీఆర్వోల చుట్టూ తిరగాల్సిన కష్టాలు ప్రజలకు తప్పేలా లేవు.

పరిష్కారం ఏదీ..

రెవెన్యూ సదస్సులో స్వీకరిస్తున్న అర్జీలలో కుల, ఆదాయం, డిజిటల్ సంతకం వంటి సమస్యలను అక్కడికక్కడే పరిష్కారించాల్సి ఉంది. మరి కొన్నింటికి గడువు విధిస్తున్నారు. ఇలా పది రోజుల నుంచి 10 గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 440 ఫిర్యాదులు రాగా.. వాటిలో ఏ ఒక్కటీ పరిష్కారం అయిన దాఖలాలు కనిపించడం లేదు. గ్రీవెన్స్‌లానే సదస్సులు మొక్కుబడిగా సాగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కొంతమంది అధికారులు సదస్సులలో పాల్గొనకుండా పలు కారణాలు చెబుతూ డుమ్మా కొడుతున్నట్లు తెలిసింది. దీంతో అనేక సమస్యలతో వచ్చే రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. న్యాయం కోసం అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మండలంలో రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన అర్జీలు..

గ్రామం	అర్జీలు
మామిళ్లపల్లి	17
ఆరెమండ	34
మునిపల్లె	70
వెల్లలూరు	100
బ్రాహ్మణకోడూరు	24
జూపూడి	22
మన్నవ	80
దొప్పలపూడి	11
వల్లభరావుపాలెం	58
ఉప్పరపాలెం	24
మొత్తం	440

నేటి నుంచి ఉపాధి హామీ గ్రామసభలు

ఎంపీడీఓ శివపార్వతి

ప్రత్తిపాడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లేబర్ బడ్జెట్ తయారు చేయడంతో పాటు పనులను ఎంపిక చేసేందుకు సోమవారం నుంచి గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.శివపార్వతి తెలిపారు. 23న ఈదులపాలెం, మేడావారిపాలెం, నడింపాలెం, తిక్కిరెడ్డిపాలెం, 24న పెదగొట్టిపాడు, కొత్తమల్లాయపాలెం, వంగిపురం, 26న యనమదల, గనికపూడి, కొండేపాడు, నిమ్మగడ్డవారిపాలెం, 27న పాతమల్లాయపాలెం, ప్రత్తిపాడు, తుమ్మలపాలెం, తిమ్మాపురం పంచాయతీల్లో గ్రామసభలు జరగనున్నట్లు చెప్పారు. గ్రామ సర్పంచుల అధ్యక్షతన జరిగే సభలకు ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, గ్రామస్తులు, ఉపాధిహామీ మేట్లు, కూలీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు హాజరు అయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా గ్రామసభ సమాచారాన్ని టాంటాంల ద్వారా గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలని ఎంపీడీఓ ఆదేశించారు.

గణితంపై పట్టు సాధిస్తే జీవితానికి వెలుగు


అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: గణితంపై పట్టు సాధిస్తే జీవితానికి వెలుగునిస్తుందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గణితశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ రావి శ్రీనివాసరావు తెలిపారు. నగర శివారుల్లోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాసరామానుజన్ జయంతి సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రామానుజన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. గణిత శాస్త్రం మానవ సామాజిక అభివృద్ధిలో ఎంతో ప్రాముఖ్యత ఉందని తెలిపారు. చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ గణితంలో ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందని, విద్యార్థులను అనేక రకాలుగా ఆలోచింపజేసి వారి ఆలోచన శక్తిని పెంపొందిస్తుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని శాస్త్రలకు రారాజైన గణితంపై విద్యార్థులు మక్కువ చూపాలన్నారు. రోజు మన దినచర్య గణితంతోనే ప్రారంభమవుతుందని మనం చేసే ప్రతి పని ఎదోక విధంగా గణితంతో ముడిపడి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వై.సుజిత్‌కుమార్, డీన్ జె.లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎ.రాధాకృష్ణమూర్తి, అతిథిని సన్మానించారు.

కాక్లియర్‌తో వినికిడి సమస్యకు చెక్


వైద్యశిబిరానికి హాజరైన వైద్యులు, ఏబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు

గుంటూరు మెడికల్: పుట్టుకతోనే వినికిడి సమస్య ఉన్న పిల్లలకు కాక్లియర్ ఆపరేషన్ ద్వారా వినికిడి సమస్యను తొలగించవచ్చని సీనియర్ కాక్లియర్ ఇంప్లాంట్ సర్జన్ డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు అన్నారు. ఆదివారం ఏబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గుంటూరువారితోట మూడోలైన్‌లోని రాధిక రాయుడు స్పెషాలిటీస్ హాస్పిటల్‌లో పుట్టుకతో వినికిడి సమస్య ఉన్న పిల్లల కోసం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని భాష్యం విద్యా సంస్థల అధినేత, ఏబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు భాష్యం రామకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆశయమైన బధిర రహిత స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్య సాధనలో భాగంగా ఇలాంటి ఉచిత శిబిరాలు, అవగాహన కార్యక్రమాలను రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ సుబ్బారాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో దేశంలో ఎక్కడలేని విధంగా ఏపీలో ఉచిత కాక్లియర్ ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. వినికిడి సమస్య ఉన్న పిల్లల తల్లిదండ్రులు ఎంతో మంది కాక్లియర్ ఆపరేషన్లపై అవగాహన లేక వయసు పరిమితి దాటిన తరువాత వైద్యుల వద్దకు రావటం వల్ల ఉచిత ఆపరేషన్లు చేయలేక పోతున్నామని చెప్పారు. మూడేళ్ల లోపు పిల్లల్లో సమస్యను గుర్తించి ఈఎన్‌టీ వైద్యులను సంప్రదిస్తే వినికిడి సమస్యను తొలగించి నూతన జీవితాన్ని ప్రసాదించవచ్చన్నారు. ఆడియాలజిస్ట్ టి.నరేంద్ర మాట్లాడుతూ అతిచిన్న వయస్సులోనే వినికిడి సమస్యను కనిపెట్టి త్వరితగతిన వారికి వినికిడి సాధనములు అమర్చాలని చెప్పారు. ఏడాదిలోపు కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్ చేయటం ద్వారా ప్రత్యేకమైన శిక్షణ లేకుండానే చిన్నారులు త్వరితగతిన సాధారణంగానే మాటలు అలవరచుకొంటారని వెల్లడించారు. ఉచిత వైద్యశిబిరానికి వందమందికి పైగా చిన్న పిల్లలు, యువకులు వచ్చారని హాస్పిటల్ అధినేత డాక్టర్ పి.రాధికారాణి తెలిపారు. అందరికి వైద్య పరీక్షలు చేసి అవసరమైనవారికి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ, ఏబీసీ వెల్ఫేర్ అసోసియేషన్, ఇతర స్వచ్ఛంద సంస్థల సహకారంతో పూర్తిగా ఉచితంగా పరీక్షలు, ఆపరేషన్లు చేస్తామన్నారు. వైద్య శిబిరంలో మూత్రపిండాల వ్యాధి నిపుణులు డాక్టర్ గొంది శివరామకృష్ణ, చిన్న పిల్లల పంటి వైద్య నిపుణులు డాక్టర్ సాయి శంకర్, డాక్టర్ దినేష్, ఆడిటర్ సుధాకర్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా పేదల బియ్యం అక్రమ రవాణా

పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం


శనివారం పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

పొన్నూరు: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందాల్సిన బియ్యం పక్కదారి పడుతోంది. పొన్నూరులోని పలు ప్రాంతాలలో రేషన్ బియ్యం నిల్వ చేసి అక్రమ వ్యాపారులు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. చాలా చోట్ల ప్రజలకు బియ్యం పంపిణీ చేయకుండా రూ.15 వంతున కార్డుదారులకు నగదు అందిస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. ఇటీవల రేషన్ మాఫియాను అరికట్టే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. ఉప్పరపాలెం కేంద్రంగా సాగుతున్న అక్రమ రవాణాపై దాడులు చేసి లారీలు, ఆటోలలో టన్నుల కొద్దీ బియ్యాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. కొన్ని నెలలుగా స్తబ్దతగా ఉన్న అక్రమ వ్యాపారం మళ్లీ ఊపందుకుంది. పట్టణం, గ్రామాల్లోని కొన్ని ఇళ్లను కేంద్రాలుగా చేసుకుని, 1,2 క్వింటాళ్ల బియ్యం మాత్రమే నిల్వ చేసి రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాల ద్వారా ఉప్పరపాలేనికి రవాణా చేస్తున్నట్లు సమాచారం. ప్రతి నెలా తొలి రెండు వారాల్లో ఈ దందా యథేచ్ఛగా సాగుతున్నా అధికార యంత్రాంగం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోంది. అక్రమాలకు పాల్పడేవారిని అదుపు చేయాల్సిన అధికారులకు నాయకులతో సన్నిహిత సంబంధాలున్నాయి. ఆరోపణలు వచ్చిన సందర్భంలో మాత్రం కొంత పట్టుకుని కేసు నమోదుతో సరిపెడుతున్నారు. మాచవరం గ్రామంలో ఓ ఇంటిలో రేషన్ బియ్యం ఉన్నట్లు సీఎస్‌డీటీకి సమాచారం రావడం తో తనిఖీ చేయగా రెండు క్వింటాళ్ల బియ్యం మాత్రమే పట్టుబడ్డాయి. కొద్దిపాటి బియ్యం నిల్వలే ఉండటంతో కేసు నమోదు చేయకుండా వదిలేసినట్లు సమాచారం. శనివారం రాత్రి పట్టణ ఎస్ఐ వి.శ్రీహరి, ఎస్పీపీ రోడ్డులో అక్రమ రేషన్ బియ్యం పట్టుకుని ఉప్పరపాలేనికికు చెందిన బూర్లగడ్డ సుబ్బారావుపై కేసు నమోదు చేసి రెండు క్వింటాళ్ల పది కిలోల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

మణిపురం ఫ్లై ఓవర్ ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు


అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: చిన్నేరు కుంట, మణిపురం ఫ్లై ఓవర్‌కి ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలని పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఆక్రమణల తొలగింపునకు అవసరమైతే పోలీస్ సహకారం తీసుకోవాలని, తొలగించిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉండాలని చెప్పారు. ఆదివారం ఆర్టీసీ కాలనీ రోడ్‌లోని చిన్నేరు కుంట, మణిపురం ఫ్లై ఓవర్ ప్రాంతాల్లో పర్యటించారు. తొలుత చిన్నేరు కుంటని పరిశీలించి, గతంలో చేపట్టిన పనులు, పెండింగ్ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చిన్నేరు కుంట చుట్టు పక్కల ఆక్రమణల తొలగింపు చేపట్టడానికి సోమవారం నోటీసులు జారీ చేయాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. కుంట చుట్టూ వాకింగ్ ట్రాక్, ఇతర అభివృద్ధి పనులను చేపట్టడానికి ఇంజినీరింగ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మణిపురం ఫ్లై ఓవర్‌కి ఇరువైపులా ఆక్రమణలను పరిశీలించి తక్షణం ఆక్రమణల తొలగింపునకు కార్యాచరణ ప్రారంభించాలని, అవసరమైతే పోలీస్ సహకారం తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ మల్లికార్జున, టీపీఎస్ లక్ష్మణ స్వామి, డీఈఈ నాగభూషణం, ఏఈ సాంబశివరావు పాల్గొన్నారు.

సుద్దపల్లిలో అగ్నిప్రమాదం

- మూడు పూరిళ్లు దగ్ధం
- సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం


అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న పూరిళ్లు

చేబ్రోలు: మండలం సుద్దపల్లి దళితవాడ ప్రాంతంలో ఆదివారం చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో మూడు కుటుంబాల వారు నిరాశ్రయులు అయ్యారు. సుమారు రూ.5 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించింది. సుద్దపల్లి దళితవాడకు చెందిన కొడూరి ప్రభుదాసు, కొమ్ము సందీ, కొమ్ము కిరణ్‌లకు చెందిన మూడు పూరిళ్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా ఖాళీ బూడిదయ్యాయి. ప్రభుదాసు ఇంటినుంచి వ్యాపించిన మంటలు సందీ, కిరణ్ ఇళ్లకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో రెండు గ్యాస్ సిలెండర్లు పేలడంతో మంటలను అదుపుచేయలేకపోయారు. అగ్నిప్రమాదంలో ఇంట్లోని విలువైన వస్తు సామగ్రి, దుస్తులు, ఫ్యానులు, మంచాలు, నగదు, తదితర సామగ్రి అంత ఖాళీ బూడిదయ్యాయి. తెనాలి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. రెవెన్యూ సిబ్బంది ఘటన ప్రాంతాన్ని పరిశీలించి ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు.


పారిశుద్ధ్య కార్మికుల డెప్యుటేషన్ రద్దు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో విధుల్లో చేరి అక్కడ విధులు నిర్వహించకుండా డెప్యుటేషన్‌పై వివిధ విభాగాల్లో, అధికారులు వద్ద పనిచేస్తున్న వంద మంది ప్రజారోగ్య కార్మికుల డెప్యుటేషన్‌ను రద్దు చేస్తూ తిరిగి ప్రజారోగ్య కార్మికులుగా విధులు నిర్వహించాలని ఆదేశిస్తూ ప్రజారోగ్య చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ శోభా రాణి ఉత్తర్వులు జారీ చేశారు.

అన్నమయ్య జిల్లా కలెక్టర్ వద్ద డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఉద్యోగి నుంచి గుంటూరు నగర పాలక సంస్థలో రెండు వేల మంది వరకు పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. కాని వీరిలో చాలా మంది పారిశుద్ధ్య విధులు కాకుండా వేర్వేరు ప్రాంతాల్లో డెప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. దీంతో నగరంలో ఆశించిన స్థాయిలో పారిశుద్ధ్యం మెరుగుపడకపోవడంతో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, పారిశుద్ధ్య కార్మికుల డెప్యుటేషన్ రద్దు చేసి తిరిగి పారిశుద్ధ్య విధులు కేటాయించాలని ప్రజారోగ్యధికారులను ఆదేశించడంతో సీఎంఓహెచ్ వివిధ విభాగాల్లో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న వారిని తిరిగి పారిశుద్ధ్య విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఇందులో కొసమెరుపు ఏమిటంటే అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఆఫీసులో, అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఇంటిలో డెప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఇద్దరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కూడా ఉన్నారు. అదే విధంగా జడ్జి బంగ్లా, హైకోర్టు జడ్జి వద్ద, ఏసీబీ కార్యాలయంలో పనిచేస్తున్న వారి డెప్యుటేషన్ రద్దు చేశారు.

వర్కర్స్ సూపర్‌వైజర్లకు ఎఫెక్ట్..

గత కొద్ది సంవత్సరాలుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లను మచ్చిక చేసుకుని... వారికి మామూళ్లు ఇచ్చుకుంటూ కొంత మంది శానిటరీ వర్కర్లు, వర్కర్స్ సూపర్‌వైజర్లుగా చలమాణి అవుతు వచ్చారు. వీరిని కూడా ఆయా పోస్టుల నుంచి బయటకు వచ్చి శానిటేషన్ విధులు నిర్వహించాలని ఆదేశించడంతో ఇప్పటి వరకు వర్కర్స్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వారికి షాక్ తగిలిందనే చెప్పుకోవచ్చు. ఒక్కో వార్డులో 3 నుంచి 5గురు దాకా వర్కర్స్ సూపర్‌వైజర్స్ ఉన్నట్లు సమాచారం. దీంతో చాలా మంది కార్మికులు గతంలో ఎక్కడ అయితే పోస్టింగ్ ఇచ్చారో అక్కడే తమని కొనసాగించే విధంగా చూడాలని పలువురు ప్రజారోగ్యధికారులకు సిఫార్సు చేయిస్తున్నట్లు సమాచారం.


శానిటేషన్ వర్కర్ల డెప్యుటేషన్ రద్దు చేస్తూ సీఎంఓహెచ్ ఇచ్చిన ఉత్తర్వులు

క్లుప్తంగా

వ్యాసరచనలో విద్యార్థిని ప్రతిభ


బొనిగల శాశ్వత

కాకుమాను: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో పాల్గొన్న పాఠశాలకు చెందిన విద్యార్థిని బొనిగల శాశ్వత జిల్లా స్థాయిలో ద్వితీయస్థానం సాధించినట్లు పాఠశాల హెచ్ఎం బి.సత్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం గుంటూరులో నిర్వహించిన వినియోగదారుల న్యాయం కోసం వర్చువల్, డిజిటల్ విచారణ అనే అంశంపై నిర్వహించిన పోటీలలో పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని శాశ్వత పాల్గొనగా ఆదివారం ఫలితాలు విడుదల చేసినట్లు తెలిపారు. పోటీలలో శాశ్వత ద్వితీయస్థానం సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థినిని ఎంఈఓలు కె.ఎఫ్.కెనడీ, కె.విజయభాస్కర్ అభినందించారు.

ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలి



పట్నంబజార్: ప్రతి ఒక్కరూ ప్రమాదాల నుంచి బయటపడేందుకు హెల్మెట్ ధరించడం ఎంతో అవసరమని వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య తెలిపారు. ఈ క్రమంలో చుట్టుగుంట సెంటర్‌లో ఆదివారం హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడుపుతున్న కొంత మందికి జరిమానా విధించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సింగయ్య మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులకు ప్రమాదాలు జరుగుతున్న సమయంలో అధికశాతం తలకు గాయం అవడం ద్వారానే మృత్యువాత పడుతున్నారనే విషయాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, లేని పక్షంలో చట్టప్రకారం జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు.

కళాకారుడు కాళిదాసు అభినందన సంచిక ఆవిష్కరణ



నగరంపాలెం: స్థానిక జిల్లా కోర్టు రోడ్డులోని ఎన్‌జీఓ కల్యాణ మండపంలో సంస్కృతి సంగీత సాహిత్య నృత్య నాటక సంస్థ ఆధ్వర్యంలో కాళిదాసు అభినందన సంచిక ఆవిష్కరణ సభ ఆదివారం నిర్వహించారు. సభకు సంస్కృతి వ్యవస్థాపకులు సర్రాజు బాలచంద్రర్ అధ్యక్షత వహించారు. రంగస్థల, సినీ నటుడు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) పుస్తకాన్ని ఆవిష్కరించారు. కళా సంస్థలు, కళాకారులు కాళిదాసు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో రంగస్థలం, సినీ నటుడు ముత్తవరపు సురేష్, ప్రజాకవి కొత్తూరు దేవేంద్ర, ఆంధ్ర ప్రజానాట్య మండలి పూర్వ కార్యదర్శి కె.శాంతారావు, ప్రజా గాయకుడు పీవీ రమణ పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ స్వామి కళావేదికపై ఆదివారం శ్రీత్యాగరాజ స్వామి సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు ఎన్.సవిత(యూఎస్ఏ) బృందం వాగ్గేయకారుల కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. వయోలిన్‌పై ఎన్.శాలిని, మృదంగంపై నేతి రామకృష్ణ వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో నేతి విశ్వేశ్వరరావు, వల్లూరి కృష్ణకిషోర్, ఎస్.గిరిజాశంకర్ పాల్గొన్నారు.

అమిత్ షాని సస్పెండ్ చేయాలి

ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి మదన మోహన్ రెడ్డి

ప్రత్తిపాడు: పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం బాధాకరమని ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి మదన మోహన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటన లో కోరారు. అమిత్ షా వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రికి అంబేడ్కర్‌పై ఏమాత్రం గౌరవం ఉన్నా తక్షణమే అమిత్ షాను కేంద్ర మంత్రి వర్గం నుంచి తొలగించి, పార్లమెంట్ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయాలని కోరారు. అంబేడ్కర్ లాంటి మహనీయుడిని గౌరవించడం మనందరి బాధ్యతని, భారతదేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

వయోవృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ



నగరంపాలెం: అందరూ ఉండి ఒంటరిగా జీవిస్తోన్న వయోవృద్ధులు, దివ్యాంగులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ తమవంతుగా సహాయం అందించాలని గిరిధారి మిత్రమండలి అధ్యక్షులు బవిరిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. కొత్తపేట సోమువారివీధిలోని మండలి కార్యాలయంలో ఆదివారం వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వయోవృద్ధులను, దివ్యాంగులను ఆదుకోవాల్సిన ఎంతైనా ఉందని అన్నారు. అనేక మంది చివరి దశలో కుటుంబ పోషణకు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. వయో భారంతో పనులు చేసుకోలేక, కుటుంబ సభ్యుల నుంచి నిరాదరణకు గురవుతున్నారని పేర్కొన్నారు. అటువంటి వారికి తమ వంతుగా సహాయం చేద్దామని చెప్పారు. కార్యక్రమంలో తవ్వా లక్ష్మణ్, మండలి కార్యదర్శి పలకలూరి శివరావు, కోశాధికారి దిండు రాజశేఖర్, సభ్యులు జుజ్జూరు శివకుమార్, పబ్బిశెట్టి సంజీవ రావు, గార్లపాటి రోశయ్య, పీఎస్ఆర్.గుప్తా, సింగంశెట్టి ఆంజనేయులు పాల్గొన్నారు.

సేవలు అందించిన సంజీవరావుకి సత్కారం



నగరంపాలెం: యాభై ఏళ్లుగా రోటరీక్లబ్‌కు జీవీఎల్ఎన్ సంజీవరావు అనేక సేవలు అందించారని రోటరీక్లబ్ ఆఫ్ గుంటూరు సెంటినీయల్ అధ్యక్షుడు పానకల బాలసుబ్రహ్మణ్యం అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో ఆదివారం నలందనగర్ ఒకటో వీధిలో సేవా శ్రామికోత్సవం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సభకు అధ్యక్షులు గాలి సుబ్బారావు అధ్యక్షత వహించారు. చిన్నారులు, విద్యార్థులకు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారని వక్తలు పేర్కొన్నారు. అనంతరం సంజీవరావును సత్కరించి, బహుమతులు అందించారు. సభలో కార్యదర్శి పొందూరి శివప్రసాద్, యలమంచిలి వేణుగోపాల్, పూర్వ అధ్యక్షులు సీహెచ్ హరికృష్ణ, కె.సీ తారమేష్, అనిల్ హరినాథ్, పచ్చిపులుసు సతీష్, యలమంచిలి వేణుగోపాల్, పబ్బిశెట్టి లక్ష్మీనారాయణ, పీవీ సత్యనారాయణ, షేక్ కాలేషా వలి, కేవీ భాస్కరరావు, నంబూరు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు


బస్సులో ప్రయాణించి బస్సు కండిషన్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం

నెహ్రూనగర్: బస్సు గ్యారేజీ నుంచి బయటకు వచ్చేటప్పుడు మెకానికల్ సిబ్బంది బస్సును క్షుణ్ణంగా తనిఖీ చేసిన ఎటువంటి లోపాలు లేవన్న తరువాతే మాత్రమే ప్రయాణికులను ఎక్కించేందుకు అనుమతి ఇవ్వాలని ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ ఆదేశించారు. ఆదివారం వాహన సామర్థ్యం, క్వాలిటీ పరిశీలన నిమిత్తమై రోడ్ టెస్ట్‌ను స్వయంగా ఆర్టీసీ ఆర్ఎం బస్సులో ప్రయాణించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు తగిన కృషి చేస్తున్నామన్నారు. షెడ్యూల్ 3 మెయింటెనెన్స్ నిర్వహణలో బస్సులో ప్రయాణించి సీట్లు, వాహన శుభ్రత, ఇతర అంశాలపై లోపాలను గుర్తించడం జరిగిందన్నారు. వాటిని మెకానికల్ సిబ్బంది వెంటనే సరిచేయడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ సీఎంఈ సత్యనారాయణ, గుంటూరు 2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com